క్లుప్తంగా

బైపాస్ రోడ్‌లో భారీగా ట్రాఫిక్ జామ్



బై పాస్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్

సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రతీ గురువారం ఇదే రోడ్డులో సంత నిర్వహించడం వల్ల రోడ్డు ఇరుకుగా మారిపోయి భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. ఈ రోడ్డులో అరకిలోమీటరు ప్రయాణానికి అరగంట పైనే పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కనుల పండువగా త్రిశూల స్నానం



స్వామివారికి భక్తుల త్రిశూల స్నానం

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ గుట్టపై కొలువైన భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం విగ్రహాలకు త్రిశూల స్నానం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో బస్మాభిషేకం, బిల్వార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఈఓ శశిధర్, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాల ముగింపు చివరి రోజు శనివారం హుండీని లెక్కిస్తామని చెప్పారు.

మీనాక్షి నటరాజన్‌ను కలిసిన నీలం మధు



నూతన ఇన్‌చార్జికి స్వాగతం పలుకుతున్న నీలం మధు

పటాన్‌చెరు: కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్ నేతృత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో యువతకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పటాన్‌చెరు టౌన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత అందిపుచ్చుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజ్ఞాన శాస్త్రం మానవ జీవన విధానాలపై చూపే ప్రభావాన్ని గుర్తు చేసుకునేందుకే సైన్స్ డే జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేసిన వారికి జరిమాన



జరిమానా రసీదులు అందజేస్తున్న అధికారి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం రోడ్డుపై చెత్త వేసిన ఇద్దరికి మున్సిపల్ కమిషనర్ జరిమానా విధించారు. మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతినగర్‌లో నివాసం ఉండే ఇద్దరు ప్రతిరోజు చెత్తను రోడ్డుపై వేస్తున్నారని గుర్తించి ఒక్కొక్కరికి రూ.200 చొప్పున సానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ జరిమానా విధించారు.

పశుసంపదపై కాలుష్య కాటు

- కాలుష్య జలాలు తాగి పశువుల మృత్యువాత
- పట్టించుకోని పీసీబీ



ఓ పరిశ్రమ గేటు నుంచి వెలువడుతున్న కాలుష్య జలాలు

జిన్నారం (పటాన్‌చెరు): కాలుష్యం కాటుకు పశుసంపద రైతులను కోలుకోకుండా చేస్తుంది. జిన్నారం మండలంలోని గడ్డపోతారం కాజిపల్లి పారిశ్రామిక వాడల్లో కొన్నాళ్లుగా పరిశ్రమల నుంచి వెలవడుతున్న రసాయన వ్యర్థ జలాలు నేరుగా చెరువులోకి కలుషితం అవుతున్నాయి. గడ్డపోతారంలోని అయ్యమ్మ చెరువు పూర్తిగా కలుషితంగా మారింది. అదేవిధంగా పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమలు రసాయన వ్యర్థ జలాలను యథేచ్ఛగా కాల్వల ద్వారా సమీపంలోని బహిరంగ ప్రదేశాలకు విడుదల చేయడంతో పరిస్థితి మరి భయానకంగా మారింది.

తూతూమంత్రంగా తనిఖీలు

కాలుష్యపు మానవ జీవితాలనే కాకుండా రైతుల జీవన విధానంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. గతంలో కిష్టయ్యపల్లికి చెందిన రైతు సాయికుమార్‌కు చెందిన 15 గేదెలు, చెట్ల పోతారానికి చెందిన రైతు సుధాకర్ పాడి పశువు రసాయన జలాలు సేవించి ఇటీవల మృత్యువాత పడిన తెలిసిందే. ఇలా తరచూ సంఘటనలు జరుగుతున్నా పీసీబీ యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుంది. ఈ విషయం పీసీబీకి ఫిర్యాదు చేసినా.. పరిశ్రమల్లో తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తుంది. కాలుష్య జలాల శాంపిల్స్ పేరిట కథ కంచికి పంపారు. చర్యలు ఎప్పుడు తీసుకుంటారో తెలియని పరిస్థితి. ఆలోపు రైతులు రోడ్డున పడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. పీసీబీ నిర్లక్ష్యాన్ని వీడి సరైన చర్యలు తీసుకుంటేనే రైతులకు స్థానికులకు న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా ఈ ఘటనపై వివరణ కోసం పీసీబీ ఈఈ కుమార్ పాఠక్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు.



ఇటీవల వ్యర్థ జలాలు సేవించి మృతి చెందిన గేదె

చర్యలు శూన్యం



పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమలు ఇష్టారాజ్యంగా కాలువల ద్వారా రసాయన వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడుదల చేస్తున్నా కనీసం అటువైపుగా పీసీబీ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఓ రైతుకు చెందిన 15 పశువులు మృతి చెందితీవ్ర నష్టం వాటిల్లింది. మళ్లీ మరోసారి ఓ రైతుకు చెందిన గేదె కాలుష్య జలాలు తాగి మృతి చెందింది. ఈ వ్యవహారంపై విచారణ జరిగి కఠిన చర్యలు తీసుకోవాలి.

–మద్దూరి పెంటేష్ (నాయకులు)

కలవర పెడుతున్న పశువుల మృతి



గ్రామ సమీపంలోని బహిరంగ ప్రదేశాల్లో మేతకు పశువులను తీసుకెళ్లాలంటే ఓ రకంగా కలవరపెడుతోంది. ఏ కాలువలోని కాలుష్య జలాలు సేవిస్తాయోనని ఆందోళనగా ఉంది. పాడి సంపద రైతులకు వెన్నుదన్నుగా ఉంటుంది. కళ్ళముందే పశువులు కూలిపోతుంటే భయం వేస్తోంది. ఇప్పటికైనా స్థానిక నాయకులు అధికారులు కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి.

– శేఖర్ (గ్రామ రైతు)

గురుకులంలో నీటి సమస్య

నారాయణఖేడ్: పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకులంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి శంకర్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకులాన్ని శుక్రవారం సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ పాడైపోయి ఏడాది అవుతున్నా.. ఇప్పటి వరకు కనీసం మరమ్మతులు చేయలేదని అన్నారు. దీంతో విద్యార్థులు తాగునీటి పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. ఈమేరకు గురుకులం ప్రిన్సిపాల్ ఖాదర్‌కు విద్యార్థుల సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నవీన్, విజయ్, విగ్నేష్ పాల్గొన్నారు.



నారాయణఖేడ్: ప్రిన్సిపాల్‌కు వితినపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

మసీదుల పరిసరాలను శుభ్రం చేయించండి

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం



వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

జోగిపేట(అందోల్): రంజాన్ మాసం ప్రారంభం కానున్నందున మసీదులు, ఈద్గాల వద్ద శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక మైనార్టీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ తిరుపతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండో తేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభంకానుందన్నారు. ఈ దినాల్లో ముస్లింలు ఉపవాస దీక్షలు చేపడతారని, ప్రతి రోజు ఐదుసార్లు ప్రార్థనలు చేసేందుకు మసీదులకు వెళతారని చెప్పారు. అందువల్ల పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించాలని, అలాగే తాగు నీరు ఏర్పాటు చేసి, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. రంజాన్ పండుగ రోజున అందోలు, జోగిపేట దర్గాల వద్ద పిచ్చి మొక్కలను తొలగించి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు అర్షత్ మోహియొద్దీన్, మహబూబ్‌ఖాన్, అలీష్‌ఖాన్, మజీద్‌ఖాన్, హాజీ, నవాజ్, నజీర్, హుస్సేనీ, అహ్మద్ అలీ ఉన్నారు.

అలరించిన కుస్తీ పోటీలు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం గోసాయిపల్లిలో మహదేవుని మందిరం వద్ద శుక్రవారం కుస్తీ పోటీలు ఘనంగా నిర్వహించారు. మహారాష్ట్ర, చుట్టూ పక్క గ్రామల నుంచి మల్లయోధులు తరలి వచ్చారు. కుస్తీ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు. చివరి కుస్తీ పోటీ విజేతకు 11 తులాల వెండి కడెం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయగౌడ్, గ్రామస్తులు ధన్‌రాజ్‌గిరి, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

ఓం కారేశ్వర మందిరం వద్ద..

సిర్గాపూర్ మండలం జంలా తండా వద్ద ఓం కారేశ్వర మందిరం వద్ద కుస్తీ పోటీలు నిర్వహించారు. గణేశ్ మహారాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. బంజార సంఘం రాష్ట్ర నాయకులు చరణ్ సింగ్ సౌజన్యంతో కుస్తీ పోటీల్లో విజేతలకు నగదు అందజేశారు. చివరి కుస్తీ పోటీ విజేతకు 11 తులాల వెండి కడెం బహూకరించారు.



గోసాయిపల్లిలో కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

మైనార్టీల అభ్యున్నతికి పెద్దపీట

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గంలో మైనార్టీల సంక్షేమానికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జీఎంఆర్ యువసేన నాయకుడు షకీల్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత నిధులతో నూతన మసీదులు, ఈద్గాలు, ఆశిర్ఖానాలు నిర్మించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. నెల రోజులపాటు కఠినంగా ఉపవాస దీక్షలు చేస్తూ అల్లాను ప్రార్థించే పవిత్ర మాసం రంజాన్ అని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



పటాన్‌చెరు టౌన్: రంజాన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జోరుగా మళ్లింపు కాల్వల తవ్వకం

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా వర్షపు నీరు మళ్లింపు కాల్వల పనులు జోరుగా జరుగుతున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో గుళిక రాళ్ల కట్టల నిర్మాణం పనులు సాగుతున్నాయి. కాగా శుక్రవారం నాగుర్(కే) శివారులో నిర్వహిస్తున్న పనులను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొలతల ప్రకారం పనులు చేసి గరిష్ట వేతనం పొందాలని కూలీలకు సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కూలీలకు వేతనంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీలో ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహించనున్న జాతర్లకు ముఖ్యఅతిథిగా రావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని ఆ గ్రామస్తులు కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 9న కట్టమైసమ్మ జాతర, 10, 11 తేదీల్లో ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు చేసినట్లు ఈ సందర్భంగా వివరించారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో ఉత్సవ కమిటీ సభ్యులు మద్దూరి పెంటేష్, నారబోయిన కుమార్ దేవయ్య ఉన్నారు.

మేరు కులస్తుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న మేరు (దర్జీ) కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తామని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం టైలర్స్ డేను పురస్కరించుకొని పటాన్‌చెరు మండలం ఇంద్రేశం పరిధిలో దర్జీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మేరు కులస్తుల సంక్షేమానికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. అనంతరం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. తన సోదరుడు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంద్రేశంలో సొంత నిధులతో 200 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి అందించారని గుర్తుచేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు లోను వారికి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. భవిష్యత్తులోనూ వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నర్ర బిక్షపతి, పృథ్వీరాజ్, చంద్రశేఖర్, అంతిరెడ్డి, చంద్రకుమార్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మేడాలమ్మ ప్రభుత్వాన్ని మేల్కొలుపు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ ప్యారానగర్ డంప్‌యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన 24వ రోజుకు చేరాయి. శుక్రవారం నవ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్షను కొనసాగించారు. డంప్‌యార్డ్ ఏర్పాటైతే ఆధ్యాత్మిక ప్రాంతాలు కాలుష్య కోరలో చిక్కుకునే ప్రమాదం ఉందని వాపోయారు. ప్యారానగర్, నల్లవల్లి, గుమ్మడిదల గ్రామాల్లోనూ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి.



దీక్షలో పాల్గొన్న నవ చైతన్య యువజన సంఘం



నారాయణఖేడ్: ప్రదర్శనలు తిలకిస్తున్న విద్యార్థులు



జహీరాబాద్ టౌన్: రావూస్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు



మునిపల్లి(అందోల్): ఉర్దూ మీడియం పాఠశాలలో..



న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న సీఐ తదితరులు

సీవీ రామన్‌కు ఘన నివాళి

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు పలు రకాల సైన్స్ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. అనంతరం సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ... విద్యార్థులు సాంకేతికతను అలవర్చుకోవాలని, సైన్స్‌పై పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు.



జహీరాబాద్ టౌన్: దనసిరిలో సీవీరామన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులకు అవగాహన కలిపిస్తున్న ఎంఈఓ నాగరం శ్రీనివాస్

సంక్షిప్త వార్తలు

◆ **పంటలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి**

హత్నూర(సంగారెడ్డి): పండించే ప్రతీ పంటపై రైతుకు అవగాహన ఉండాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ పేర్కొన్నారు. హత్నూర మండలం పన్యాల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పన్యాలలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు? పంటల ఆధారంగా రైతులకున్న వనరులు, సమస్యలు వంటి అంశాలను గురించి రైతులకు వివరించారు.

◆ **నేటి నుంచి గంధాల ఉత్సవాలు**

నారాయణఖేడ్: మండలం జుజాల్‌పూర్ శివారులో శని, ఆదివారాల్లో సయ్యద్ గట్టు మౌలాలి దర్గా వద్ద గంధాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులతో పాటు గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం గంధాలు, ఖవ్వాలి, ఆదివారం జల్సా, అలయ్, అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు వివరించారు.

◆ **ఆర్టిస్ట్ కొమ్ములకు డీపీఆర్వో పరామర్శ**

సంగారెడ్డి: తెలంగాణ సాంస్కృతిక సారథి, సంగారెడ్డి జిల్లా కళాకారుడైన కొమ్ముల శేఖర్‌గౌడ్‌ను జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్వో) ఏడుకొండలు శుక్రవారం పరామర్శించారు. శేఖర్ గౌడ్ అనారోగ్యంతో సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని సారథి జిల్లా టీమ్ లీడర్ అయిదాల సునీల్ ద్వారా తెలుసుకున్న ఏడుకొండలు వెంటనే ఆస్పత్రికి వెళ్లారు. శేఖర్‌గౌడ్ అనారోగ్యానికి గల కారణాలు, అందుతున్న వైద్యం గురించి కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితులను దృష్ట్యా ప్రభుత్వం ద్వారా కల్పించాల్సిన సహాయసహకారాలు అందిస్తామని, ధైర్యంగా ఉండాలని సూచించారు. శేఖర్ గౌడ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

◆ **విద్యార్థుల స్వయం పాలన**

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం వాసర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం జరుపుకొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం మంజులదేవి అభినందించారు. కార్యక్రమంలో టీచర్లు రహీం, తుకారాం పాల్గొన్నారు.

◆ **ఇష్టంతో చదువుకోవాలి**

నారాయణఖేడ్: విద్యార్థులు చదువును ఇష్టంతో చదువుకోవాలని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల, ఆచార్య డిగ్రీ కళాశాల వార్షికోత్సవాల్లో శుక్రవారం పాల్గొని మాట్లాడుతూ.. ఇష్టంతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లిదండ్రులు, చదువు నేర్పిన గురువుల ఆశయాలను నెరవేర్చాలన్నారు.

◆ **అఖండ హరినామ సప్తాహం ముగింపు**

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని ఎంపల్లి ఆలయంలో శుక్రవారం కాలకీర్తనతో అఖండ హరినామ సప్తాహం ముగిసింది. గతవారం రోజులుగా నిర్వహించిన సప్తాహంలో భాగంగా గురువారం గాథపూజ, శుక్రవారం ఉదయం కాలకీర్తన నిర్వహించారు.

◆ **నేలల స్వభావాన్ని బట్టి సాగుచేయాలి**

వట్‌పల్లి(అందోల్): నేలల స్వభావాన్ని బట్టి రైతులు పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ సూచించారు. అందోలు మండల పరిధిలోని అల్మాయిపేటలో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆర్ఏడబ్ల్యూపీ విద్యార్థులు గ్రామంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులు, సమస్యల గురించి వివిధ చిత్రపటాల సాయంతో రైతులకు వివరించారు.

◆ **సమస్యలు పరిష్కరించాలి**

నారాయణఖేడ్: ప్రజలకు సంబంధించిన వివిధ సమస్యలను పరిష్కరించాలని ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఖేడ్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

నారాయణఖేడ్: ఖేడ్‌లోని మనూరు తండాకు చెందిన వసంత్ నాయక్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి శుక్రవారం అందజేశారు.

◆ **ఠాణాలో సిబ్బంది కొరత**

నారాయణఖేడ్: నూతనంగా నాగల్‌గిద్ద మండల కేంద్రం 2016లో ఏర్పాటు కాగా అదే సమయంలో ఏర్పాటైన పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తుంది. ఇటీవల స్టేషన్‌కు నూతన భవనాన్ని నిర్మించారు. స్టేషన్‌లో 21 మంది కానిస్టేబుళ్లు అవసరం ఉండగా ఏడుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు ఉండగా, ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. మిగతా ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు డిప్యూటేషన్‌పై వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఏఎస్ఐలు ఇద్దరు అవసరం ఉండగా ఒక్కరు మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరత కారణంగా స్టేషన్ నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

◆ **నేడు విద్యుత్‌కు అంతరాయం**

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని అల్మాయిపేట 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర మరమ్మతుల కారణంగా అల్మాయిపేట, సంగుపేట, చందంపేట, సాయిబాన్‌పేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

◆ **మూఢ నమ్మకాలు పాటించొద్దు**

కంది(సంగారెడ్డి): ప్రజలు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు బాలయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఎద్దు మైలారం జెడ్పీహెచ్ స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశం నుంచి ఇంతవరకు విజ్ఞాన రంగంలో నోబెల్ బహుమతి పొందిన సీవీ రామనే మొదటి, చివరి వారు కావడం విచారకరమన్నారు. సైన్స్ పరంగా మనం ఎంతో ఎదగాల్సిన అవసరం ఉందని చెప్పారు.

◆ **చికెన్ మేళాకు భారీ స్పందన**

న్యాల్‌కల్(జహీరాబాద్): వెన్‌కాబ్ సంస్థ ఆధ్వర్యంలో న్యాల్‌కల్‌లోని ముదాసిర్ చికెన్ దుకాణంలో శుక్రవారం రాత్రి చికెన్ మేళాను నిర్వహించారు. ఈ మేళాలో చికెన్ ఉత్పత్తులను ఉచితంగా పంపిణీ చేయడంతో ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చారు. నిర్భయంగా చికెన్ ఉత్పత్తులను రుచిచూశారు. కార్యక్రమాన్ని డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి తదితరులు ఫ్రీ చికెన్, గుడ్లు పంపిణీ చేశారు.

◆ **సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి**

సంగారెడ్డి : బంజారా గిరిజనుల ఆరాధ్యదైవం బాల బ్రహ్మచారి శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును దేశవ్యాప్తంగా సెలవుదినంగా ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ డిమాండ్ చేశారు.